క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలోని వేదికపై సుదర్శన పెరుమాళ్లను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ అర్చకులు భార్గవ తదితరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీరు వృథా



కుళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరం వద్ద ఏర్పాటు చేసిన కుళాయి నుంచి కొంత కాలంగా తాగునీరు వృథాగా పోతుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు, చేపల వేటపై ఆధారపడుతున్న మత్స్యకార్మికుల దాహార్తి తీర్చడానికి తీరం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయి మరమ్మతులకు గురైంది. తాగు నీరు వృథాగా పోతుంది. కుళాయి మరమ్మతులు చేపట్టి తాగునీరు వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శభాష్ వలంటీర్



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రీను

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన శెట్టి పైడికొండ అనారోగ్యంతో బాధపడుతూ కొంత కాలంగా విశాఖలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆగస్టు నెల పింఛన్ సొమ్మును గ్రామ వలంటీరు రెడ్డి శ్రీను సొంత ఖర్చులతో నగరంలోని ఆస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న వృద్ధురాలు పైడికొండకు పింఛన్ సొమ్మును అందజేశారు. దీంతో వలంటీరు శ్రీనును వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

శాశ్వత పైప్‌లైన్ ఏర్పాటు



తాగునీటి పైపులు వేస్తున్న సిబ్బంది

పరవాడ: జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెం గ్రామంలో హైవే వెంబడి ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ మరమ్మతులకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడి పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురయ్యేది. విషయాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు కన్వీనర్ సాలాపు సంతోష్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆయన ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు బుధవారం ప్లాస్టిక్ పైపు లైన్‌ను తొలగించి శాశ్వత పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారని వార్డు కన్వీనర్ సంతోష్ తెలిపారు.

ఉచితంగా లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం పశు వైద్య కేంద్రం పరిధిలో ఈ నెల 31వ తేదీ వరకు ఉచితంగా లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకురాలు ఉషా కిరణ్ కుమారి బుధవారం తెలిపారు. పాడి రైతులంతా తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రంలో ఉండే పశు వైద్య సహాయకుడిని సంప్రదించాలన్నారు. 4 నెలలు వయసు దాటిన ఆడ,మగ పశువులన్నిటికీ టీకాలు వేయించుకోవాలని సూచించారు. సబ్బవరం ప్రాంతీయ పశు వైద్య కేంద్రం పరిధిలో 8 వేలు డోసులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఆమె తెలిపారు.

మూడు రంగాలకు పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- సబ్బవరం పీహెచ్‌సీలో అదనపు బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన



ఆశ కార్యకర్తకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సబ్బవరం పీహెచ్‌సీలో నూతన బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం:విద్య,వైద్యం,వ్యవసాయ రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు బ్లాక్ నిర్మాణానికి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పెందుర్తి సీహెచ్‌సీని రూ.2.60 కోట్లతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. సబ్బవరం పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.కోటి మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ వ్యక్తిగత కారణాలతో వెనుకంజ వేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. రెండో విడత టెండర్ పిలవడంతో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కోవిడ్ వంటి ప్రమాదకర పరిస్థితుల్లో సైతం ఉపయోగపడే విధంగా ఒక ఐసోలేషన్ బ్లాక్‌ను రూ.50 లక్షలతో నిర్మించి త్వరితగతిన అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. నూతనంగా సబ్బవరం–1 సచివాలయ ఆశ వర్కర్‌గా నియమించిన ఎ.దుర్గాదేవికి ఆయన నియామక పత్రం అందజేశారు.

వ్యక్తి తప్పు చేస్తే వ్యవస్థకు ఆపాదించడం తగదు

పెందుర్తికి చెందిన వృద్ధురాలి హత్యోదంతంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే స్పందించారు. వలంటీర్ అనేది రెండు లక్షలకు పైగా ఉన్న పెద్ద వ్యవస్థ అన్నారు. దీనిలో ఒక వ్యక్తి తప్పుచేస్తే వ్యవస్థకు ఆపాదించడం సరికాదన్నారు. మూడు నెలల కిందట పెందుర్తిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినపుడు ఆ వలంటీర్‌పై ఫిర్యాదులు రావడంతో తొలగించాలని జెడ్పీని ఆదేశించామన్నారు. విధుల నుంచి తొలగించే ప్రక్రియ కొంత ఆలస్యమవుతుందన్నారు.అయితే ఈ సంఘటన జరగకముందే ఆయన్ను విధుల నుంచి తొలగించినట్టు చెప్పారు. టీడీపీ, జనసేన పార్టీల్లో మహిళలపై ఎన్నో దారుణాలు జరుగుతున్నాయని వారంతా పార్టీలు మూసేసారా అని ప్రశ్నించారు.

కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు,ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ, పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,శరగడం రాము,వనం అచ్చెంనాయుడు,మోపాడ అప్పారావు,బోను గంగునాయుడు,రాపేటి రాము,సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ అధికార ప్రతినిధులు ఐడీబాబు,యర్ర శ్రీనివాసరావు, పార్టీ మండల యువజన, మహిళా విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, బంతికోళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు

- 30న ప్రతి ఒక్కరూ రక్ష ధరించాలి
- ధర్మప్రచారక్ అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

పరవాడ: ఈ నెల 30న వ్యాస పూర్ణిమను పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ రక్ష ధరించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు అన్నారు. పరవాడ రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు దేశానికి ధర్మానికి గ్రామానికి రక్షగా నిలవాలన్నదే సమరసత సేవా ఫౌండేషన్ ఆశయమన్నారు. ఈ మాసంలో రెండు పౌర్ణమిలు, రెండు ఏకాదశిలు వస్తున్నాయని చెప్పారు. పౌర్ణమి రోజున , ఏకాదశి రోజున సామూహిక హారతి ఇవ్వాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రతీ వ్యక్తిలో దేశభక్తి నింపాలన్నారు. దేవాలయాలు, ధర్మం పట్ల ప్రతీ ఒక్కరు అభిమానం కలిగి ఉండాలని అప్పలనాయుడు కోరారు. సమావేశంలో మాతృమూర్తులు నూకాలమ్మ, పార్వతి, సహాయ కన్వీనరు పైల శ్రీను, సభ్యులు కట్టా ఆదినారాయణ, పి.లోవరాజు, బి.గంగరాజు, వి.సూరిబాబు, వి.అప్పారావు, డి.అన్నాజీ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



ర్యాలీ నిర్వహిస్తున్న అడవివరం ఆరోగ్యకేంద్రం సిబ్బంది

సింహాచలం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అడవివరం ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ ప్రసాద్ నాయక్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి అడవివరం ప్రధాన కూడలి వరకు జరిగిన ర్యాలీని ప్రసాద్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు పెట్టడం వల్ల ప్రసవం నుంచి వెంకటనే రికవరీ అవడం, త్వరగా బరువు తగ్గడం, తల్లీబిడ్డల మధ్య అనుబంధం ఏర్పడుతుందన్నారు. తల్లులకు క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గడం వంటి ప్రయోజనాలు చేకూరతాయన్నారు. ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ రాణి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు కూడా తల్లిపాలు పట్టడం చాలా ఉత్తమమన్నారు. తల్లిపాలు తాగే పిల్లల్లో వ్యాధులను తట్టుకునే శక్తి లభిస్తుందన్నారు. ప్యాకెట్ పాలు, డబ్బాపాల వినియోగం తగ్గించాలని పిలుపునిచ్చారు. బ్రెస్ట్ ఫీడింగ్‌పై అపోహలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆర్ ఝాన్సీరాణి, డి.పార్వతీశం, ఎస్.ఎలమాదేవి, పి.వి.నరసింగరావు, ఎస్.గోపాలకృష్ణ, కె.కిషోర్, దేవుడమ్మ, నర్సమ్మ, కేజీహెచ్ ప్రొఫెసర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడ సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్ఠంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మందుబాబులకు రూ.76వేల జరిమానా

సింహాచలం: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 25 మంది వాహనదారులను బుధవారం కోర్టులో ప్రవేపెట్టగా వారికి మెజిస్ట్రేట్ రూ.76 వేలు జరిమానా విధించారని ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ తెలిపారు. చినముషిడివాడ, నాయుడుతోట, వేపగుంట, నరవ తదితర ముఖ్య కూడళ్లలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 25 మంది మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు.

గొప్ప సంస్కర్తలు పింగళి, పీసీ రామ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర సమరయోధులు పింగళి వెంకయ్య, పీసీ రామ్‌ల జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి స్వాతంత్రోద్యమంలో జాతీయ వాదాన్ని ప్రేరేపించిన గొప్ప మహనీయులని కొనియాడారు. పింగళి వెంకయ్య ప్రముఖ గాంధేయవాదిగా, సంస్కర్తగా జాతి మొత్తం గర్వించదగ్గ జాతీయ జెండాను రూపకల్పన చేశారని విద్యార్థులకు వివరించారు. అలాగే ప్రముఖ బెంగాలీ రసాయన శాస్త్రవేత్త పీసీ రామ్ స్వాతంత్ర పోరాటంలో విద్యార్థులను ఉత్తేజితులను చేయడం ద్వారా ఉద్యమాన్ని ఉధృతం చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి. శంకర్, అధ్యాపకులు వీవీ గోపాలకృష్ణ,రామకృష్ణ,గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- అన్నంరెడ్డి అదీప్‌రాజ్



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల కళ్లల్లో ఆనందాన్ని నింపుతున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందించే కార్యక్రమంలో అదీప్‌రాజ్ మాట్లాడారు. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు జగన్‌మోహన్‌రెడ్డి పోషకాలు కలిగిన పది రకాల ఆహారాన్ని కిట్‌ల రూపంలో అందిస్తున్నారన్నారు. కులం, మతం,ప్రాంతం, రాజకీయం చూడకుండా అర్హులందరికీ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు భగవాన్ జయరామ్, గొర్లె రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: దేశంలో ఏ ముఖ్యమంత్రి అందించని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. 95వవార్డు పరిధి వరలక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలు, తల్లులకు పది రకాల పోషకాహార సరకులతో కూడిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లకిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు వారి ఆరోగ్యం బాగుండాలని సీఎం జగన్ కోరుకుంటున్నారన్నారు. దానిలో భాగంగానే తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు ఈ కిట్లు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అవి కూడా నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంట్ల నర్సింహమూర్తి, బొడ్డు దేముడుబాబు, అంగటి సూరిబాబు, పువ్వాడ త్రినాథ్, భాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ టి.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలెం దరి రాజీవ్‌నగర్‌కు చెందిన చింతా చంద్రశేఖరరావు (50) ఫార్మా కంపెనీలో పని చేస్తున్నారు. బుధవారం పనిమీద గాజువాక వచ్చిన ఆయన పాతగాజువాక నుంచి శీలానగర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో, పాతగాజువాక జంక్షన్‌లో ఆయన వాహనాన్ని వెనుక నుంచి ఖాళీ ట్రాలీ వ్యాను ఢీ కొట్టింది. అదుపు తప్పిన చంద్రశేఖరరావు కుడి తొడ వ్యాను చక్రం కింద పడి విరిగిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాద వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు.

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

సీతమ్మధార: ఫిబ్రవరి 1999 నుంచి 2004 జూలై 31 మధ్య నియమించబడిన విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధి కె.తేజభాస్కరరావు డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి, ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. పెరిగిన పని భారానికి అనుగుణంగా వెంటనే అదనపు పోస్టులు మంజూరు చేయాలన్నారు. జూనియర్ ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పీ అండ్ జీ ట్రస్టులను బలోపేతం చేయాలని, యూనియన్లు, అసోషియేషన్లకు సభ్యత్వం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పి.చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ పి.ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ బి.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెంచ్ భాషా వారోత్సవాలు



విద్యార్థినులతో ముఖ్య అతిథి మేరీ ఏంజిల్ బసేస్

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఫ్రెంచ్ జాతీయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. ఫ్రెంచ్ భాష ఆచార్య సిస్టర్ జైస్ నేతృత్వంలో ఫ్రెంచ్ గీతాలాపన, అభినయం, నృత్యాలు, సంస్కృతి పట్ల అవగాహన, క్విజ్ పోటీలు నిర్వహించారు. తమ కళాశాల ప్రారంభం నుంచి ఫ్రెంచ్‌ను ద్వితీయ భాషగా నేర్పిస్తున్నట్లు విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. ముఖ్య అతిథిగా మేరీ ఏంజిల్ బసేస్ హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో ఫ్రెంచ్ భాష గొప్పదనాన్ని వివరించారు. విదేశీ భాషలు నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసంతో పాటు మేధో వికాసం పెరుగుతుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో 'క్విట్ కార్పొరేట్'

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ కో–కన్వీనర్ అయోధ్యరామ్ విమర్శించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో ఆగస్టు 9వ తేదీన జరగనున్న నిరసన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 902వ రోజు సంస్థలోని సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతతో బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ అంశంగా మలచే దిశగా కార్మికవర్గం అడుగులు వేయాలన్నారు. ఉక్కు ఉద్యమంలో ప్రజలను మరింత మమేకం చేసేలా ఉద్యమాలపై అవగాహన కలిగిస్తామన్నారు. అందుకోసం ఉక్కు కార్మికవర్గం సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు వై.టి.దాస్, విల్లా రామ్మోహనకుమార్, వరసాల శ్రీనివాసరావు, రమణరావు, ఏ శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు



రిక్రియేషన్ పార్కును శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: స్థానిక కోనేరు వద్ద ఉన్న పార్క్ రూపురేఖలు మార్చడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. కోనేరు వద్ద లుపిన్ పరిశ్రమ యాజమాన్యం లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ పార్క్‌ను గ్రామ ప్రజలు కొంత కాలం పాటు సక్రమంగా వినియోగించుకున్నారు. ఆ తర్వాత పార్క్ నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. తాగిన మద్యం సీసాలు చెల్లాచెదురుగా విసిరేయడం, సీసాలు పగలగొట్టడంతో పార్క్ నిండా గాజుపెంకులు, పిచ్చి మొక్కలు పెరిగి క్రిమికీటకాలకు ఆవాసంగా మారింది. అధ్వానంగా మారిన పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దడానికి పంచాయతీ అధికారులు నడుంబిగించారు. దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలు తొలగించడంతో పాటు చెల్లాచెదురుగా పడి ఉన్న గాజుపెంకులు, చెత్తా చెదారాలను తొలగిస్తున్నారు. పార్క్‌లో చేపడుతున్న పనులను సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పార్క్‌ను అందంగా తీర్చిదిద్ది పూర్వ వైభవం తీసుకువస్తామని సర్పంచ్ అప్పలనాయుడు చెప్పారు.

ప్రతీ పంటను ఈ క్రాప్‌లో నమోదు చేయాలి



రైతులు, వ్యవసాయ సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

సబ్బవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసే ప్రతి పంటను కచ్చితమైన సమాచారంతో ఈ క్రాప్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహన్‌రావు సూచించారు. మండలంలోని ఎరుకనాయుడుపాలెంలో ఈ పంట నమోదును క్షేత్రస్థాయిలో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన అన్ని పంటలతో పాటు ముఖ్యంగా నోటిఫైడ్ క్రాఫ్ అయిన వరి పంటను జాగ్రత్తగా నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఈ పంటలో వివరాలు నమోదు చేయడం వల్ల ఉచిత పంటల బీమా పథకం వర్తిస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పెట్టుబడి రాయితీతో పాటు పండిన పంటను ఆర్బీకేల ద్వారా కొనుగోలు మొదలైన అన్ని రకాల ఉపయోగాలు ఉంటాయని తెలియజేసారు. నువ్వు,గంటి తదితర పంటలను ఈ క్రాప్‌లో వెంటనే నమోదు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీ మురళి, వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు అలేఖ్య, హరీష్, లావణ్య,భావన, రమాదేవితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం రేపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు శ్రీనివాసరావు

సీతంపేట: శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. సీతంపేటలోని తన ఇంటి వద్ద బుధవారం ఉదయం ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో సుమారు నాలుగున్నర లక్షల మంది శెట్టి బలిజలు ఉన్నారని, వారందర్నీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేలా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. శెట్టిబలిజ సంఘం నాయకుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తులు, ఉన్నత హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన వైద్యాధికారులు కడలి సత్యవరప్రసాద్, కముజు నరసింహారెడ్డి, యాండ్ర రాంప్రసాద్, యాండ్ర లక్ష్మీ నరసింగరావు, చెల్లుబోయిన మంగ వెంకట్‌లను సత్కరిస్తామన్నారు. నగరంలోని శెట్టి బలిజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కడలి సుబ్బారావు, కేతా గంగరాజు, కడలి శివ కేశవ నరసింహారావు, వాసర్ల బాలకృష్ణ, గుత్తుల వెంకటేశ్వరరావు, నరాల బాలకృష్ణ, గుత్తుల సుబ్రహ్మణ్యం, గుత్తుల రాజశేఖర్, కట్టా శ్రీకాంత్, మామిడిశెట్టి రామకృష్ణమూర్తి, రాయుడు శివరామకృష్ణ పాల్గొన్నారు.